# ఈ పాలకులపై ముస్లింలలో తీవ్ర వ్యతిరేకత : టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మార్చి 8, ప్రభాతవార్త:
తమ వాడని ఎమ్మెల్యేగా ఓట్లు వేసి గెలిపించుకుంటే చివరికి తమ సమస్యలు సైతం కూడ తీర్చలేదని స్వయాన ముస్లీంలు చెబుతున్నారని కర్నూలు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. డా.గఫార్ వీధి చిన్న రంగరాజు వీధిలో శుక్రవారం ఆయన టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో పథకాలను ప్రజలకు అందించి టీజీ భరత్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని కోరారు. ఈసందర్భంగా టీజీ భరత్‌కు ముస్లీం మహిళలు పెద్దలు అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ వైర్ల సమస్యలను మొరపెట్టుకున్నారు.కులం చూసి ఓటు వేస్తే తమకు నష్టమే జరిగిందన్నారు. కులం మతం పక్కన పెట్టి ఒక్కసారి తమ పాలన చూడాలన్నారు. తాను గెలిస్తే కర్నూలు నగరంతో పాటు జిల్లా మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటిగా మారుస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు శేషగిరి శెట్టి, జియా, కార్పొరేటర్ పరమేష్, మన్సూర్ అలీఖాన్, టీజీ శ్రీనివాసులు, సల్మాన్ విఠల్‌శెట్టి, శ్రీధర్, మంజు, భాగ్యలక్ష్మీ, సుకూర్, ఇంజార్, ఇమ్రాన్, ఫర్తుల్లా, షమీర్, జమీర్, ఖలీల్, రహ్మతుల్లా, యూసుఫ్, మునీర్, రాజేశ్వరీ, రేణుక, సతీష్, మురళీ, నారాయణ, కిరన్, బూత్ ఇంచార్జీలు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కర్నూలు | నంద్యాల వార్త
9 మార్చి , 2024 శనివారం పేజీలు 4

దోషదూషనాశ వినాశనా... నాగభూషణా సృష్టికారణ, నష్టహరణ తమోరజోసత్వగుణ విమోచనా... హర హర మహాదేవ శంభో శంకర... అంటూ శ్రీశైలం పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తాదులు శివనామస్మరణతో.. క్షేత్రంలో జరిగే పూజా కార్యక్రమాలతో... భక్తి పారవశ్యంలో తేలియాడారు.

శ్రీశైలంప్రాజెక్టు, ప్రభాతవార్త:



- శివనామస్మరణతో మార్మోగిన శ్రీగిరులు
- శ్రీశైలంలో శివరాత్రి మహోత్సవం
- పోటెత్తిన భక్తాదులు
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- కన్నుల పండువగా మల్లన్న పాగాలంకరణ
- కమనీయం శ్రీస్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం
- నందీవాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లు
- ఆదిదంపతులకు వైభవంగా కల్యాణం

• వివరాలు 2లో





# హరహర.. మహాదేవ..!

## పంచాక్షరీ నామంతో మారు మ్రోగిన సప్తనదుల సంగమేశ్వరం



కొత్తపల్లి, మార్చి 8, ప్రభాతవార్త:
మహాశివరాత్రి పురస్కారించుకొని సప్తనదుల సంగమేశ్వరం లో భక్తులు చేసిన పంచాక్షరీ నామంతో మారుమ్రోగింది. శుక్రవారం సంగమేశ్వరంలో భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చి సంగమేశ్వరంలో స్నానాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు.

## స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన టిటిడి



మహానంది, మార్చి 8, ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం నందు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. తీసుకువచ్చిన వారికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ వేద పండితులు వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం నుండి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు మరియు అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు



పత్తికొండ, మార్చి 8, ప్రభాతవార్త
నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం మండల పరిధిఇలోని మండగిరి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని నారా భువనేశ్వరికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందచేశారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు.

## శ్రీశైలం ఘాట్ ప్రయాణం..
# దుమ్ములోనే ప్రయాణం...!

: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకున్న భక్తాదులు
: ప్రభుత్వమే ప్రమాదాలకు కారణమా..!
: తాత్కాలిక పనులు చేపట్టి దుమ్ములేపుతున్నారు
: కోట్ల నిధులు కేటాయించినా ఫలితం శూన్యం
: ప్రాణంతకమైన మలుపులతో పొంచిఉన్న ప్రమాదం





ఆత్మకూరు మార్చి8, ప్రభాతవార్త:
మహాశివరాత్రి పండుగ పర్వదినాని పురష్కరించుకోని తిరుగు ప్రయాణంలో శివభక్తులకు ప్రాణాంతకమైన మలుపులతో ఘాట్ రోడ్డులో పోంచి ఉన్న ప్రమాదంగా మారిందని చెప్పవచ్చు. ఈ ప్రమాదాలకు కారణం ప్రభుత్వమే బాధ్యత లేక కాంట్రక్టార్ల అనే విషయం తెలియాల్సి ఉంది. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రయాణం కొనసాగించాలంటే ప్రమాదాని అరిచేతిలో పెట్టుకోని ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు రోడ్డుకు ఇరువైపుల మట్టి రోడ్డు పనులు చేపట్టిన ప్రభుత్వ వైఖరి తీరుపై ప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు రెండు వైపుల ట్రాక్టర్లతో మట్టి గుంతలు పూడ్చే తాత్కాలిక పనులు చేపట్టినప్పటికి మరింత ప్రమాదం ఉందని తెలుసుకోని పరిస్థితులో కొనసాగిస్తున్నారు. మహాశివరాత్రి ముందు చేపట్టిన పనులపై స్పందించే అధికారులే కరవైయ్యారని చెప్పారు. ఇరువైపుల దుమ్ము, గుంతలు అధికంగా ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న రోడ్డు బస్సులు వేళ్లే క్రమంలో రోడ్డు మార్గం మొత్తం దుమ్ములో కురుకపోతుంది. ప్రయాణానికి రక్షణ లేకుండా పోయిందని చెప్పవచ్చు. శ్రీశైలం మల్లన్న ఆశీస్సులతో తమ కుటుంబాలను చేరే క్రమంలో ఘాట్ రోడ్డులో ప్రాణాంతకమైన మలుపులతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకోని ముందుకు కొనసాగాల్సి ఉంది. ఘాట్ రోడ్డులో ఒక తరహా ప్రయాణం కొనసాగిస్తే ఘాట్ దిగిన తర్వాత అడవి మార్గంలో దాదాపు 20కిలో మీటర్లు దుమ్ములోనే ప్రయాణం కొనసాగించాల్సి ఉంది. రాత్రి వేళ సమయంలో వాహనాలను నెమ్మదిగా తీసుకోని రావాల్సినప్పటికి వాహనాలు ఒకరిపై ఒక్కరు పోటీగా నడుపుతే ప్రమాదాలు అత్యదికంగా 2లో

# బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శ్రీశైలంప్రాజెక్టు, మార్చి08, ప్రబాతవార్త
శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారంనాడు నంద్యాల జిల్లా సర్వోన్నతాదికిరి కె.శ్రీనివాసులు జిల్లా, దేవస్థానం అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో పారిశుధ్యం పనులు, త్రాగునీటి సదుపాయం, పార్కింగ్ ప్రదేశాలను కలియ తిరిగారు. ఈ నేపధ్యాంలోనే పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని డిపిఓను ఆదేశించారు. భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసిన మంచీనీటి ట్యాంకుల్లో త్రాగు నీరు కోరత లేకుండా ఎప్పటికప్పుడు నీటిని నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఈఈ రామకృష్ణను ఆదేశించారు. అదే విధంగా దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూం నందు కలేక్టర్ కె.శ్రీనివాసులు ఆధ్యక్షతన, జేసి రాహుల్‌కుమార్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పి రఘువీర్‌రెడ్డి, ఆర్.డి.ఓ దాసు, దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు తదితర అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ బ్రహ్మోత్సవాల మొదటి రోజు నుండి పండుగ రోజువరకు దాదాపు 8లక్షల మంది భక్తులు శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రదానంగా పారిశుద్యం, త్రాగునీరు, పార్కింగ్ ప్రదేశాలు, భక్తులకు ఉచిత దర్శనం క్యూలైన్లు, లడ్డు ప్రసాదాలు కౌంటర్లు, శివదీక్షా శిబిరాలు, ఉద్యానవనాలు, తదితర ముఖ్యప్రదేశాలలో రద్దీ చోటు చేసుకోకుండా తగు సూచనలు ఇవ్వాల్సిందిగా సంబందింత అధికారులను ఆదేశించారు. అత్యవసర ప్రధమ చికిత్స కేంద్రాలతో పాటు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి భక్తులకు కల్పిస్తున్న వైద్యసే వలపై కలేక్టర్ ఆరా తీసారు. పాగాలంకరణకు సంబందించి చేస్తున్న ఏర్పాట్లపై పరిశీలిస్తు భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థానం ఈఓ పెద్దిరాజును కలేక్టర్ ఆదేశించారు. అదే విదంగా స్వామివార్ల కల్యాణోత్సవానికి కూడా పటిష్ట ఏర్పాట్లు చేసుకోని భక్తులు వీక్షించేలా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. 12 జోన్లుగా విభజించిన శ్రీశైలక్షేత్రంను కమాండ్ కంట్రోల్ రూం నుండి క్షేత్రం నలువైపుల పరిశీలించారు.

# భక్తులతో పోటెత్తిన మహానంది క్షేత్రం..!



మహానంది, మార్చి 8, ప్రభాతవార్త:
ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలో భాగంగా మూడవ రోజు మాఘబహుళచతుర్థశి శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లోకకళ్యాణార్థం లింగోద్భవకాలంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అందులో భాగంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్యందు భక్తులకు బిస్కెట్ల ప్యాకిట్ల పంపిణీ నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సమీపంలో ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్లు పల్లకీలో ఆశీనులు గావించి ఉదయం శేషవాహన సేవలో భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనమిచ్చారు. రాత్రి నందివాహన సేవలో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి పనులకై..
# భూమి పూజ

- రూ.1కోటి 10లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు...
- భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి...

వెల్దుర్తి, మార్చి8, ప్రభాతవార్త:
వెల్దుర్తి మండలంంలోని శ్రీరంగాపురం గ్రామం పరిధిలో కొండపై ఉన్న శ్రీ పాలుట్ల రంగస్వామి ఆలయం నందు రూ.1కోటి 10లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి చేతుల మీదుగా శుక్రవారం భూమి పూజ చేశారు. ఇందుకు సంబంధించిన శిలాఫలాకాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నిధులతో శ్రీ రంగనాథస్వామి ఆలయంలో రాజగోపురం, రహదారిని నిర్మించునున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి, వైకాపా యువనాయకులు కంగాటి రాంమోహన్‌రెడ్డి, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, శ్రీరంగాపురం, గూటుపల్లి గ్రామాల సర్పంచ్‌లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

- రూ.1.50 లక్షల నగదు, ఏడు తులాల బంగారం బుగ్గి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ



2లో

మంత్రాలయం, మార్చి 8, ప్రభాతవార్త:
నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో శుక్రవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఇంటిలో మంటలు వ్యాపించడంతో ఇంటిలో విలువైన సామాగ్రి, దుస్తులు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయి పనికిరాకుండా పోయాయి. తద్వారా సుమారు రూ.10 లక్షలు ఆస్థినష్టం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం పట్టణానికి చెందిన వైభవ్ ఆచారి కుటుంబం మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో నివాసం ఉంటున్నారు. వీరు కర్ణాటకలోని బిచ్చాలి గ్రామంలో ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పురోహితులుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శివరాత్రి పర్వదిన వేడుకలకు గాను వీరి కుటుంబం కర్ణాటకలోని కొప్పల్‌కు బయలుదేరారు. వారిఇంటిసిసి కెమెరాకు, కుటుంబ యజమాని ఫోన్‌కు ఆన్‌లైన్ సౌకర్యం ఉండడంతో వారి ఇంటిలో నుండి దట్టమైన పొగలు రావడం గమనించి వారి బంధువులకు సమాచారం తెలియజేశారు. బంధువులు ఇంటిదగ్గరకు వెళ్ళి గమనించేలోపు ఇల్లుమొత్తం దట్టమైన...

## ఈ టాబ్లెట్లు మాత్రం
# అసలు వాడొద్దు..!




- మార్కెట్‌లోకి నకిలీవి
- డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

నంద్యాల విద్య, మార్చి 8, ప్రభాతవార్త:
ప్రతి మనిషికి చిన్న నొప్పి వచ్చినా తట్టుకునే శక్తి ఉన్నప్పటికి మాత్రల కోసం ఎగబడుతున్న నేటి సమాజంలో సొమ్ముచేసుకోవడానికి రకరకాల మోసాలతో మాత్రలను తయారుచేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల నకిలీ మందుల తయారిని డ్రగ్ కంట్రోల్ అధికారులు బట్టబయలు చేసిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగిస్తోంది. మెగ్‌లైన్ సైన్సెస్ కంపెనీ పేరుతో మార్కెట్‌లోకి వస్తున్న మెడిషన్స్ నకిలీవి అని డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించి సీజ్‌చేసిన సంఘటన జరిగింది. ఎంపిఓడి-200 ట్యాబ్లెట్లు పేరుతో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆ ట్యాబ్‌లెట్లలో అసలు మెడిషిన్ లేదని చాకిస్‌పీస్ పౌడర్, గంజితో తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేశారు. కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆ మాత్రలను సీజ్ చేసింది. దాదాపు రూ.33 లక్షల మందులను డిస్ట్రిక్ కంట్రోల్ అధికారులు సీజ్ చేశారు. ఈకంపెనీ పేరుతో వచ్చే మెడిసిన్స్ వాడకం వినియోగంలో లేకుండా అపివేయాలని అదేశించారు. కల్తీమందులు తయారీచేస్తున్న వారిపై కేసులు కూడ నమోదుచేశారు. ఈమందులను వాడితే ప్రాణాపాయంతో పాటు హై రిస్క్ ఉంటుందన్నారు. ఈమందులను మెడికల్ షాపుల్లో రిటైలర్స్ డిస్ట్రిబ్యూట్ చేయరాదని డ్రగ్ కంట్రోల్ అధికారులు అదేశాలు జారీచేశారు. ఏవరైనా ఇప్పటికే ఈ మందులను కొనుగోలుచేసి ఉంటే వాటిని వాడకుండా చెత్తబుట్టలో వేయాలని సూచించారు. మందుల అజమాయిషిపై అధికారులు ఉదాసీనంగా వ్యవహారించడం తగదని పేర్కొన్నారు.

## ముస్లిం మైనార్టీలు సహేరిని సద్వినియోగం చేసుకోండి



**ఆత్మకూరు మార్చి8,ప్రభాతవార్త:** రంజాన్ మాసంలో ముస్లిం మైనార్టీలు చేపట్టే ఉపవాస దీక్షల ప్రపంచశాంతి కోసం ప్రార్థన చేయాలని మోమిన్ హస్సేన్ సాబ్ అంజుమాన్ ఏ ఇబ్రాహిం ఖలీలుల్లా, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్సిల్ మున్నాలు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే వారి కోసం 30 రోజులు సహేరి ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణ ముస్లిం సోదరులు సహేరీ ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముస్లిం మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని ప్రతి ఒక్కరు ప్రశాంతమైన జీవితం కొనసాగించాలన్నారు. ఉదయం 2గంటల నుంచి 4 గంటల వరకు సంప్రదిస్తే నేరుగా వారి ఇంటి దగ్గరకే భోజనాలు తీసుకొని వెళ్లి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పేహమాం, షేక్.అహ్మద్, రహం, మోమిన్ రహంతుల్లా, టైగర్ బాబు, పాన్ మహ్మద్, భాజా, షఫి, ఎన్.ఎస్.అసదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## 40మందికి చెక్కభజన బృందానికి టీషర్టులు పంపిణీ



**ఆత్మకూరు మార్చి8,ప్రభాతవార్త:** ప్రాచీన కళలను కళాకారులను ప్రోత్సాహించడంలో యువత ముందుకు రావాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తిరుపతయ్య, దాత శకునాల శివరామకృష్ణయాదవ్‌లో పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో మండల పరిధిలోని అమలాపురం గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి చెక్కభజన బృందానికి చెందిన 40మంది కళాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన జానపద కళలను కళాకారులను ఆదరించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా కళాకారులు చేస్తున్న సంప్రదాయ నృత్యాలు, కళలు నేటికి చెక్కు చెదరకుండా లేదని గుర్తు చేశారు. ప్రాచీన కళాలను కాపాడుకొనుటకు కళాకారులను ప్రోత్సాహించాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో చెక్కభజన కళాకారుల గురువు శింగారం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



**ఆత్మకూరు మార్చి8,ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల భాగంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అనేక మంది మహిళలు ఉన్నత స్థానాల్లో నిలిచారని గుర్తు చేశారు. వారందరి స్ఫూర్తితో మహిళలు అందరు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, మెప్మా సీఈఓ హుసేన్‌బీ, పొదుపు మహిళ నాయకురాలు షఫివున్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యంపై సెబ్ పోలీసుల పంజా..

:-మద్యం తరలింపును ఎక్కడికక్కడే పట్టివేత..




**కోసిగి, మార్చి 8, ప్రభాతవార్త :** అక్రమ మద్యం విచ్చల విడిగా రహస్యంగా కోసిగికి తరలిస్తున్న వారిపై కోసిగి సెబ్ పోలీసులు పంజా వేస్తున్నారు. రాత్రిళ్లు నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడిక్కడే అక్రమ మద్యంను పట్టుకుంటున్నారు.. ఇందులో భాగంగా మొన్న 920 కర్ణాటక బాటిళ్లును సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకోగా, శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 960 కర్ణాటక బాటిళ్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు కర్నూలు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో సిఐ మహబూబ్ బాష, ఆద్వర్యంలో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కోసిగి మండల పరిదిలోని తుంగభద్ర నది పరిసరాల ప్రాంతంలో మఫ్టిలో ఉన్న సెబ్ పోలీసులతో పాటు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సిఐ మహబూబ్‌బాష నేతృత్వంలో తుంగభద్ర నదిలో అక్రమ రవాణాకు సిద్దంగా ఉన్న మద్యంపై దాడులు నిర్వహించారు. దీనిని గమనించిన అక్రమ మద్యం దారులు పారిపోయారు. అయినా వారిని వెంబడించినా దొరకలేదు. అయితే నిందితులు వదిలిన అట్టపెట్టలు 10 బాక్సులను విప్పి చూడగా అందులో 960 కర్ణాటక టెట్రా బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా అక్రమ మద్యం వదిలి పారిపోయిన నిందితుడిని గుర్తించినట్లు, కందుకూరు గ్రామానికి చెందిన బోయ వీరారెడ్డిగా గుర్తించి ఇతనిపై కేసు నమోదు చేసినట్లు, గతంలో కూడా ఈయనపై అక్రమ మద్యంకు సంబందించిన కేసులు కూడా ఉన్నాయని తెలిపారు.. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ అక్రమ మద్యం దాడుల్లో స్వయానా జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ రెండు రోజులు పాటు కాపు కాసి పట్టుకోవడం విశేషం..

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

:- ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు



**ఆలూరు,మార్చి 8,ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఎస్‌టియు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు,పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్పు,సహనంలో మహిళలను మించిన వారు ఉండరని మహిళలను ప్రోత్సహిస్తే ఇంకా ఎన్నో సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులమ్మ,మహదేవమ్మ, సుధారాణి,ప్రహ్లాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు జయమ్మ,రామలింగమ్మ,శ్రీకృష్ణ దేవరాయ స్కూల్ కరస్పాండెంట్ ప్రగతి,ప్రగతి స్కూల్ నిర్వాహకులు పద్మావతి,ఎస్‌టియు నాయకులు రామకృష్ణారెడ్డి,సూర్య నారాయణ,నాగరాజు,రిటైర్డ్ టీచర్ గోవిందప్ప,కవి ఈశ్వరప్ప తదితరులున్నారు.

## ఐరన్‌బండంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



**గోనెగండ్ల మార్చి 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివభక్తులు,గ్రామ ప్రజలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.శుక్రవారం ఉదయం నుంచి శివభక్తులు పరమ పవిత్రమైన పర్వదినం మహాశివరాత్రి సందర్భంగా శివలింగంకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.ఐరన్‌బండ గ్రామంలో శివాలయంలో ప్రత్యేక అలంకరణం చేసి పూజలు పూజారి సురేంద్ర,శివభక్తులు,గ్రామ పెద్దలు నిర్వహించారు.ఆయా గ్రామాల్లో శివాలయలల్లో సాయంత్రం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.శివరాత్రి సందర్భంగా శివ జాగరణ,ప్రత్యేక పూజలు శివనామ స్మరణలతో నిర్వహించినట్లు శివభక్తులు,గ్రామ పెద్దలు తెలిపారు.

## వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

-శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు



**బండిఆత్మకూరు, మార్చి 8, ప్రభాతవార్తః** నల్లమల అటవీప్రాంతంలో వెలసిన ఓంకారం, శివనంది, కృష్ణనంది శైవక్షేత్రాల్లో భక్తులతో కిట కిటలాండింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. ఓంకార క్షేత్రంలో గంగా ఉమ సమేత సిద్దేశ్వర స్వామివార్లకు భక్తులు ప్రతే్యక పూజలు నిర్వహించారు. భక్తులు పరశివునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన అభయాంజనేసా్వమి విగ్రహాం, నవగ్రహాల చుట్టు మహిళలు ప్రదక్షణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నల్లమల కొండపై వెలసిన బ్రహ్మవిష్ణు మహేశ్వరులను భక్తులు కాలినడకన కొండపైకి ఎక్కి దర్శించుకున్నారు. అనంతరం ఓకారం నుండి నల్లమల అటవీప్రాంతం గుండి కృష్ణానంది, శివనంది ఆలయాలకు భక్తులు చేరుకొని ఆ పరమశివుని దర్శించుకున్నారు. ఓంకారం క్షేత్రనానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రతే్యక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, ఈఓ నాగప్రసాద్, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీకి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు ఈఓ, ఆలయ చైర్మన్ శాలువతో సత్కరించారు. భక్తులకు కాశీరెడ్డి నాయన ఆశ్రమంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## గ్రామ శివార్లలో సంచరిస్తున్న నెమళ్లు



**గోనెగండ్ల మార్చి 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దనెలటూరు గ్రామ శివార్లలో శుక్రవారం ఉదయం నెమళ్లు సంచరించాయి.అడవి,పంట పొలాలు వదలి గ్రామ శివార్లలో నెమళ్లు రావడం పట్ల గ్రామస్థులు ఆచార్యం వ్యక్తం చేశారు.వాటిని ఎవ్వరు ఏమి ఆనక పోవడంతో కొద్ది సమయం సంచరించి మళ్లి పొలల వైపు వెళ్లిపోయాయి.అయితే ఎప్పుడు గ్రామాల వైపు రాని నెమళ్లు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని తెలుసుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. ఇంతకాలమైన కూడా పొలాలో పంటలు సాగు చేయక పోవడంతో నెమళ్లు ఉదయం సంచరిస్తు గ్రామ శివార్లలోకి వచ్చినట్లు తెలిసింది.

## ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు



**మహానంది, మార్చి 8, ప్రభాతవార్తః** మహానంది క్షేత్రానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల దృష్ట్యా ప్రతియేటా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి అధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మహానంది మండల ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షులు అమర్నాద్ అన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ మల్లిఖార్జునరెడ్డి, తహాశీల్దార్ రామచంద్రుడు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతియేటా ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటి అధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు అందిస్తు భక్తులకు సేవలు అందిస్తున్నారని ఆర్డీఓ కొనియాడారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు ఉచిత వైద్యసేవలు అందించడం మంచివిషయన్నారు.ఈకార్యక్రమంలో మండ రెడ్‌క్రాస్ సభ్యులు రాంప్రసాద్, స్వాములు, కమలాకర్ నాయుడు, మద్దిలేటి, లాల్ మదార్ తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలను దృష్టిలోవుంచుకుని బయట తిరగరాదు - వైద్యాధికారి చందన



**పగిడ్యాల, మార్చి 8,ప్రభాతవార్త :** మండుతున్న ఎండలను దృష్టిలో వుంచుకుని మధ్యాహన్నం బయట ప్రజలు తిరగరాదనీ పగిడ్యాల హోమియో వైద్యాధికారి డాక్టర్ చందన అన్నారు. మహాశివరాత్రి పురష్కరించుకుని పగిడ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని బీరవోలు కెసికెనాల్ బ్రిడ్జివద్ద వెలసిన శ్రీభీమలింగేశ్వరస్వామి అలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శుక్రవారం ఉచిత వైద్యాశిభిరము ఏర్పాటు చేశారు. అలయానికి వచ్చిన వారికి హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చందన మాట్లాడుతూ ఎక్కువగా ఎండల్లో తిరగరాదనీ, మంచి నీళ్లు బాగా త్రాగాలన్నారు. అదేవిధంగా పండ్లు తీసుకోవాలనీ అరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని తగిన శ్రద్ధ తీసుకోవలసిన అవసరంఎంతైనా వుందనీ, హోమియో వైద్యాధికారి డాక్టర్ చందన తెలిపారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**మంత్రాలయం,మార్చి 8,ప్రభాతవార్త:**నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ఉన్న వైభవ్ ఆచారి అనే పూజారి ఇంటిలో అగ్నిప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అగ్నిప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నగదు,ఏడు తులాల బంగారంతో పాటు విలువైన సామాగ్రి మొత్తం కాలిపోయినట్లు తెలుసుకున్నారు.వీరిని ఆదుకునే నిమిత్తం రూ.25,000 ఆర్థిక సహాయం చేశారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సీతారామిరెడ్డి హామీ ఇచ్చారు.వీరివెంట వైసిపి మండల అధ్యక్షులు భీంరెడ్డి,జనార్దన్‌రెడ్డి,ఎస్ఐ గోపినాథ్,వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున,రవిస్వామి,వికెసి రాఘవేంద్రాచారి తదితరులు ఉన్నారు.



## హర హర మహాదేవ..!

**శ్రీశైలంప్రాజెక్టు,మార్చి08,ప్రభాతవార్త**

శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకోని నవాహ్నిక దీక్షతో పదకోండు రోజులపాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సల ఏనిమిదవ రోజైన శుక్రవారంనాడు శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.తరువాత యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి.అనంతరం లోక కల్యాణం కోసం జపాలు,పారయణలు చేయబడ్డాయి.అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్టానాలు, నిత్యహవనాలు, రుద్రహోమం,చండీహోమం,కార్యక్రమాలు ఆగమశాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధంగా ఈ సాయంకాలం ప్రదోష కాలపూజలు,జపానుష్టానాలు,రుద్రపారాయణలు హోమాలు జరిపించబడ్డాయి.

**కమనీయం మల్లన్న ప్రభోత్సవం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో బాగంగా సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం అంగరంగ వైభంగా నిర్వహించడం జరిగింది.రధోత్సవంలో రధనికి చేసినట్లుగానే ప్రభోత్సవంలో కూడా ప్రభకు పలు రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేయడం జరిగింది.అదే విధంగా ప్రభోత్సవంలో నాదస్వరం, నాధస్వరం, కోలాటం, చెక్కభజన, రాజుభటులవేషాలు,కేరళ చండీమేళం,కొమ్ముకొయ్య నృత్యం,ముంబాయ్ డొల్ ధాషా,మహిళ వీరగాసి కన్నడ జానపద కళా ప్రదర్శన,పురుషులు వీరగాసి కన్నడ కళా ప్రదర్శన,కాళికా నృత్యం,జాంజ్‌పథక్,జానపద పగటి వేషాలు, గొరవనృత్యం, బుట్టబోమ్మలు, తప్పేటచిందు, బీరప్పడోలు,నందికోలసేవ,ఢమరకం,చిడతలు,శంఖం,పిల్లనగ్రోని,డోలు విన్యాసం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం,గంగధర మండపం మీదుగా నందిమండపం,బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కోనసాగింది.పుష్పపల్లకీపై దర్శనమిచ్చిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా వీక్షించి మురిసిపోయారు.గ్రామొత్సవంలో కార్యనిర్వహణాదికారి డి.పెద్దిరాజు దంపతులు,ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి,అధికారులు,అర్చకస్వాములు,భక్తులు పెద్ద సంఖ్యాలో పాల్గొన్నారు.

**నందీవాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లు:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకోని నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా శుక్రవారంనాడు శ్రీస్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ మరియు ఆలయ ఉత్సవం నిర్వహించడం జరిగింది.

**లింగోద్భవకాల మహారుద్రాభిషేకం:** మహాశివరాత్రిని పర్వదినంను పురస్కరించుకోని శుక్రవారంనాడు రాత్రి గం.10.00 నుండి శ్రీస్వామివారికి లింగోద్భవకాల మహారుద్రభిషేకం,జరిపించబడింది.నిష్ణాతులైన 11 మంది అర్చక స్వాములు మహాన్యాసపూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా దాదాపు 4గంటలకు పైగా జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీస్వామివారికి అభిషేకం జరిపించబడింది.ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికాగుండంలోని జలంతోనూ,పంచామృతాలతోనూ,పలు ఫలోదకాలతోనూ అభిషేకం నిర్వహించడం జరిగింది.

**పెళ్లి కుమారునికి పాగాలంకరణ:** లింగోద్భవకాల మహారుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంబించబడింది.బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణకు ఎంతో ప్రత్యేకత ఉంది.మన వివాహాలలో పెండ్లికుమారునికి తలపాగా చుట్టడం ఒక సంప్రదాయం.ఈ ఆచారమే శ్రీశైల ఆలయంలో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతుంది.ఈ పాగా స్వామివారి గర్బాలయ విమాన శిఖరం నుండి ముఖమండపంపై ఉండే నందులను అనుసందానం చేస్తు అలంకరించడం జరిగింది.పాగాలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేళవించి రోజుకు ఒకమూర చోప్పున సంవత్సరంలో 365 మూరల పోడవుతో ఈ పాగాను నేస్తారు.ఈ పాగాలను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగాను అలంకరిస్తాడు.దిగంబరుడై పాగాను అలంకరించవలసి ఉన్నందున పాగాలంకరణ సమయంలో ఆలయంలో విధ్యుత్ సరఫరాను నిలిపి వేస్తారు.చిమ్మచీకటిలో పాగాలంకరణ చేయడం ఎంతో నేర్పుతో కూడుకొన్న పని.యధావిధిగా రాత్రి గం.10.00ల నుండి ప్రకాశం జిల్లా,చీరాల మండలం,హస్తినాపుర గ్రామానికి చెందిన పృద్వీ వెంకటేశ్వర్లు తనయుడు ఫృధ్వీ సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగాతో పాటు ఇతర భక్తులు సమర్పించిన పాగాలను కూడా స్వామివారికి అలంకరిస్తారు.ఈ సంవత్సరం మొత్తం 31 పాగాలు శ్రీస్వామివారికి సమర్పించబడ్డాయి.

**ఆది దంపతులకు ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం:** రాత్రి గం.12.00లకు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిపించబడింది.కనుల పండువగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో స్వామివారు పట్టువస్త్రాన్ని ధరించి,తలపై ఒకవైపు గంగయ్మను,మరోవైపు నెలవంకను,మెడలో రుద్రాక్షమాలను,నుదట విభూతి రేఖలను,పట్టు వస్త్రాలను ధరించి పెండ్లికుమారుడుగా ముస్తాబు అయ్యారు.కాగా అమ్మవారు కూడా పట్టువస్త్రాలను ధరించి,నుదుట కల్యాణ తిలకాన్ని,బుగ్గన చుక్కను,సర్వాభరణాలను ధరించి పెండ్లికుమార్తె అయి స్వామికి సరిజోడినినపించుకున్నారు. మంగళతూర్యనాదాలతో,వేదమంత్రాల నడుమ నేత్రానందంగా ఈ కల్యాణోత్సవం జరిగింది.అంతకు ముందుగా ఈ లీలా కల్యాణానికి కంకణాలను స్వామిఅమ్మవారి అభరణాలను యజ్ఞోపవీతాన్ని భాషికాలను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకోని వచ్చారు.ఈ కల్యాణోత్సవంలో లోకకల్యాణాన్నికాంక్షిస్తూ ముందుగా అర్చకస్వాములు కల్యాణోత్సవం సంకల్పాన్ని పఠిస్తారు.తరువాత కల్యాణోత్సవం నిర్విఘ్నంగా జరగాలని గణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత వృద్ధి అభ్యుదయాల కోసం పుణ్యాహవచనం చేసారు.తరువాత స్వామివారికి మధువర్కం సమర్పించబడి శ్రీస్వామిఅమ్మవార్లకు వస్త్రాలను సమర్పించబడ్డాయి.తరువాత భాషికధారణ కార్యక్రమం జరిగింది.ఆ తరువాత గౌరిపూజ జరిపించబడింది.స్వామిఅమ్మవార్ల మధ్య తెర సెల్లను ఏర్పరచి మహాసంకల్ప పఠనం చేయడం జరిగింది.అనంతరం సుముహర్త సమయంలో స్వామిఅమ్మవార్లకు జీలకర్ర,బెల్లం సమర్పించారు.ఆ తరువాత మాంగల్యపూజను జరిపించి అమ్మవారికి మాంగల్యధారణ జరిపించబడింది.తరువాత తలంబ్రాలు,బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు ఆశీర్వచనాన్ని అందజేయం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి,ఆలయ ఈఓ డి.పెద్దిరాజు,ఉత్సవాల ప్రత్యేక ఆధికారి ఆజాద్,ప్రజాప్రతినిధులు,అదికారులు,అర్చకస్వాములు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఘాట్ ప్రయాణం.. దుమ్ములోనే ప్రయాణం...!

(మొదటి పేజీ తరువాయి ) : జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తు న్నాయి. కోట్ల రూపాయాల నిధులు కేటాయించిన్నప్పటికి అవి కేవలం శివరాత్రికి మాత్రమే ఉపయోగపడే విదంగా అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బిల్లులు రాలే దంటూ సాకు చెబుతూ నాశిరక మైన పనులను చేయడంలో రోడ్డుకు ఇరువైపుల మట్టి తోలిన పనులో ఎవరి పర్శింటేజ్ ఎంత ముట్టిందో తెలియాల్సి ఉన్నప్పటికి ప్రభుత్వమే దగ్గర ఉండి ప్రమాదాలు చేయించే విదంగా ప్రయాణంను కొనసాగించే విదంగా పలువురు భక్తాదులు అధికారుల తీరుపై అరోపిస్తున్నారు. కనీసం అడవి మార్గంలో జరిపిన పనులకు దుమ్ములేయకుండా ట్యాంకర్లతో నీటితో తడిపి రోడ్డు రోలర్ తిప్పాల్సినప్పటికి బిల్లులు వచ్చాయ పనులు చేశామనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తున్నారు. ఏదిఏమై న్నప్పటికి నల్లమల అడవి మార్గం లో పర్యావరణం వన్యప్రానుల సంరక్షణకు పెన్నుముప్పుగా మారిన ఈ రహదారి మార్గంలో శివభక్తుల ప్రయాణం శుఖశాంతంగా ముందుకు సాగేనా అంటూ పలువురు భక్తాదులు మల్లన్న స్వామిని వేడుకుంటున్నారు.

## విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

**(మొదటి పేజీ తరువాయి ) :** పొగలతో నిండిపోయింది.వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు.ఇంటి తాళాలు తీస్తే కనీసం ఇంటిలోపలికి వెళ్ళడానికి సైతం వీలులేకుండా పొగతో నిండిపోయింది.అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చారు.అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఈ అగ్నిప్రమాదంలో విలువైన రెండు ఏసిలు,రెండు టివిలు,ఒక ఫ్రిజ్,ఫ్యాన్‌లు,లైట్లు, ధాన్యం, దుస్తులు,కారు,ఇంటి డాక్యుమెంట్లు,రూ.1.50 లక్షల నగదు,ఏడు తులాల బంగారం పూర్తిగా కాలిపోయాయ. వీటితో పాటు చుట్టుప్రక్కల ఉన్న ఇండ్లలో ఉన్న 20 టివిలు,ఫ్యాన్‌లు కాలిపోయినట్లు స్థానికులు తెలియజేశారు.మొత్తం సుమారు రూ.10 లక్షల ఆస్థినష్టం సంభవించినట్లు తెలిపారు.సమాచారం తెలుసుకున్న ఎస్ఐ గోపినాథ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును గమనించారు.కుటుంబ సభ్యుతో వివరాలు సేకరించారు.అదేవిధంగా ట్రాన్స్‌కో ఏఈ గోవింద్ ఆదేశాల మేరకు లైన్‌మెన్ రాజశేఖర్,రంగస్వామిలు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తిరుపాడులో పండగపూట కూడా తీరని నీటి సమస్య

**గడివేముల, మార్చి08, ప్రభాతవార్త;** మండలంలోని తిరుపాడు గ్రామంలోని 3, 4వ వార్డుల్లో నీటి సమస్యకు పరిష్కారం చూపేవాళ్లు లేకుండా పోయారు. పండగపూట ట్యాంకర్ బాడుగకు తెచ్చుకుని నీళ్లు నింపుకోవడం జరిగింది. గత కొన్ని నెలల క్రితం కుళాయి కనెక్షన్ కోసం రూ.1000 తీసుకున్న గ్రామ సర్పంచ్ నెలలు గడుస్తున్నా కూడా నీరు ఇచ్చే ఆలోచనే లేదని తిరుపాడు గ్రామ వార్డు ప్రజలువాపోయారు. ఇప్పుడు ఈ వార్డుల ప్రజలు అడిగితే పైపులు ఇస్తాం మీరే కనెక్షన్ వేసుకోండి అని బాధ్యత లేని మాటలు చెబుతున్నారని, గ్రామం కోసం వేయించిన బోర్లలో సర్పంచ్‌కు సంబంధించిన వారి పొలాల్లో నీరు పెట్టుకోవడానికి వాడుకొన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలకు నీరు ఇచ్చేది లేదు కానీ వాటితో వాళ్ల సొంత పొలాలు పండించుకుంటున్నారని, ఇదే విషయం పంచాయతీ సెక్రటరీకి చెబితే మాకు సంబంధంలేదని, అది గ్రామ సర్పంచ్‌కు సంబంధమని వాళ్లు కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు తెలిపారు. ప్రభుత్వం చూస్తే పల్లెటూర్లను ప్రగతిబాటలో నడిపిస్తున్నామని ఉత్తుత్తి మాటలు చెబుతోందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కూడా తీర్చలేకపోతే ఇక గ్రామ సర్పంచ్ ఎందుకు, అధికారులు ఎందుకు అని ప్రనంచారు. తమ వార్డులో నెలకొన్న నీటి సమసయను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఆ వార్డుల ప్రజలు హెచ్చరించారు.

## ఘనంగా శివరాత్రి వేడుకలు

**ఆలూరు,మార్చి 8,ప్రభాతవార్త :** మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. అన్ని శివాలయాల్లో వేకువజాము నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. పట్టణంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయం,జలకంటేశ్వర స్వామి ఆలయంలో ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ ఓబులేషు,జడ్‌పిటిసి ఏరూరు శేఖర్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మాషాఅల్లా వెల్ఫేర్ సొసైటీ ఆద్వర్యంలో చలివేంద్రం

**హొళగుంద,మార్చి 8,ప్రభాతవార్త** హొళగుందలోని స్థానిక బస్టాండ్‌లో మాషాఅల్లా వెల్ఫేర్ సొసైటీ ఆద్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మాభాషా,ఉమర్,నూరుల్లా,భాషా,అబ్దుల్ సుభాన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ పెద్దయ్య నాయుడు హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు జరిగిందన్నారు. నీటిని వృధా చేయకుండ పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ గ్రూపు ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో శాలీ షబ్బీర్,సుభాన్,ఇస్మాయిల్,తాహేర్, అబుబకర్,షఫీ,రఫిక్ తదితరులున్నారు.

## మహిళా శక్తి అనంతమైనది



**పత్తికొండ,మార్చి 8,ప్రభాతవార్త :** ప్రపంచంలో మహిళా శక్తి అనంతమైనదని మహిళలు తలచుకుంటే దేనినైనా సాధిస్తారని మాజీ ఎంపిపి ఎస్ నాగరత్నమ్మ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేసి మహిళలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాగరత్నమ్మ మాట్లాడుతూ సహనంలో,ఓర్పులో మహిళలకు మించిన వారు ఎవరు ఉండరన్నారు. ప్రతి కుటుంబంలో తల్లితో మొదలుకుని అక్కాచెల్లెలు, భార్య అందరు కుటుంబానికి ఎంతో కూర్పుగా తమ సహాయ,సహకారాలు అందిస్తారన్నారు. అలాంటి మహిళలను ప్రోత్సహిస్తే మరింత సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము దీపిక,మైనార్టీ ఉద్యోగుల సంఘం నాయకులు సాలె బొకారియా,జిలాన్,హుస్సేన్,ఫకృద్దీన్,ఉపాధ్యాయిని పద్మావతి,ట్రస్టు సభ్యులు ఎస్ ఖాజాహుస్సేన్,లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన దేవాలయాలు



**ఆస్పరి,మార్చి 8,ప్రభాతవార్త :** మండలంలోని అన్ని శివాలయాల్లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మారుమోగిపోయాయి. శివరాత్రి సందర్భంగా భక్తులు ఎంతో నీష్టతో శివాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తి పరవశంలో మునిగిపోయారు. అలాగే మండల పరిధిలోని తంగరడోన,ఆస్పరి,చిగిలి,కారుమంచి,ములుగుందం,చిన్నహోతూరు తదితర గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన శివాలయాల్లో ఈశ్వరుడికి ఆకు పూజ,అభిషేకాలు,మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తులు గుగ్గిళ్లు,పండ్లు తీసుకుని స్వామి వారికి నైవేధ్యంగా సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రి ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న,పెద్ద నిద్ర కాచి జాగారణ చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**నందికొట్కూరు,మార్చి 8,ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కారించుకొని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుండే ఉమారామలింగేశ్వరస్వామి, కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఓ నమశ్శివాయ అను పంచాక్షరీ నామంతో భక్తులు స్వామివారిని దర్శించుకొని అత్యంత భక్తిశ్రద్దలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీసాయిబాబా దేవాలయంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుద్రాల శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

## పెద్దకడుబూరు గ్రామ పరిశుభ్రతకు కృషి చేస్తా



**పెద్దకడుబూరు,మార్చి 8,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామాన్ని ప్రజల సహకారంతో పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తానని ఆ గ్రామ సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. గ్రామంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం కురువ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని,పెంటదిబ్బలు తీయించి ట్రాక్టర్‌తో ఊరుబయటకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో లక్ష్మిపేట,చౌడేశ్వరి కాలనీ,ఎస్‌సి కాలనీ,అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని విడతల వారిగా శుభ్రం చేయించడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండ పంచాయతీ అధికారులతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు చెత్తాచెదారాన్ని డ్రైనేజీల్లో పారవేయకుండ చెత్తబుట్టల్లో వేసుకుని ఇళ్లదగ్గరకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. మన ఇళ్లు..మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు.

## 10న అంతర్‌రాష్ట్ర స్థాయి ఎద్దుల రాతిధూల ప్రదర్శన

**ఆస్పరి,మార్చి 8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బిణిగేరి గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకుని పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీన అంతర్‌రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల రాతిధూలం ప్రదర్శనను ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కన్వినర్ రేమట గిడ్డయ్య నాయుడు తెలిపారు. ఈ రాతిధూలం పోటీలను గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు న్యూ కేటగిరి ఒంగోలు జాతి ఎద్దులు పాల్గొంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు రూ.600లు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ.50వేలు దాత ఆలూరు వైసిపి ఇంచార్జ్ విరుపాక్షి,రెండో బహుమతి రూ.40వేలు టిడిపి ఇంచార్జ్ ,మూడో బహుమతి రూ.30వేలు జడ్‌పిటిసి దొరబాబు,నాల్గో బహుమతి రూ.20వేలు ఎంపిపి సుంకర ఉమాదేవి భర్త రామాంజనేయులు, ఐదో బహుమతి రూ.10వేలు శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి,పురుషోత్తంరెడ్డిలు అందచేయనున్నట్లు వారు తెలిపారు. కన్సోలేషన్ బహుమతులు ప్రతి జట్టుకు రూ.5వేలు అందచేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకై గిడ్డయ్య 9106894468,కోతి రంగడు 9318129338లను సంప్రదించాలన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**సూగూరు(మంత్రాలయం),మార్చి 8,ప్రభాతవార్త:**మండల పరిధిలోని సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత స్వవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.పాఠశాల హెచ్‌ఎం లచ్చప్ప ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ముందుగా పాఠశాలలో విధులు నిర్వహిస్తుస్తున్న భౌతికశాస్త్రం మహిళా ఉపాధ్యాయులు లక్ష్మిదేవి,సోనాలను దుశ్శాలువా,పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా,సామాజికంగా,ఆర్థికంగా ఎదిగిన తీరును వివరించారు.మహిళలు ఇంకా ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బ ంది రవీంద్ర,శ్రీనివాసులు,తిమ్మప్ప.నాగరాజు,గోపికృష్ణ,రాజశేఖర్,రామాంజినేయులు,మెహబూబ్,బాలరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజేపితో టిడిపి,జనసేన పొత్తు విచారకరం



**నందికొట్కూరు,మార్చి 8,ప్రభాతవార్త:** ఏ.పి.కి.ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని బిజేపితో తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడం విచారకరమని సి.పి.యం.పార్టీ నాయకులు ఎం.నాగేశ్వరరావు, పి.పక్కీర్‌సాహెబ్, తెలిపారు. శుక్రవారం స్తానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి చేయకుండా, అమరావతి రాజధానికి, కడప స్టీల్ ప్లాంట్‌కు నిధుల ఇవ్వకుండా, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తున్న నరేంద్రమోడీ బిజేపితో ప్రాంతీయ పార్టీలు పొత్తు పెట్టుకోవడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి కాదని, బిజేపి పల్లకి మోసేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఎన్నికల ముందు స్వామినాథన్ కమీషన్ సిఫారస్‌లను అమలు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టబద్దత కల్పిస్తామని, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ధరలను వంద రోజుల్లో అదుపు చేస్తామని హామీలు ఇచ్చిన నరేంద్రమోడీ వాటిని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. టిడిపి జనసేర ఏ ప్రాతిపదికన బిజేపితో పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎం.కర్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## పార్వతి,పరమేశ్వరుల ఉత్సవ విగ్రహం ఊరేగింపు



**ఆస్పరి,మార్చి 8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బిణిగేరి గ్రామంలో శ్రీగిరి క్షేత్రంలో కొలువైన శ్రీ పంచలింగేశ్వర స్వామి ఉత్సవాలు,మహాశివరాత్రి పురస్కరించుకుని గ్రామంలో రామిరెడ్డి,చంద్రారెడ్డి ఇంటి నుండి పార్వతి,పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌లో కూర్చోబెట్టుకుని గ్రామంలో డ్రమ్స్,నందికోలు సేవ మధ్య పంచలింగేశ్వర స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన,రమాదేవి దంపతులు తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటలకు స్వామి వారికి సహస్ర గరిక,పుష్ప,సాహితి,గణపతి హోమం,9గంటలకు గంగపూజ,కంకణాధరణ నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు స్వామి వారి ఉత్సవ మూర్తులను బీరప్పడోళ్ల మధ్య భూచక్ర గొడుగులు, గడస్థంభం ఊరేగింపు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన వసతి కల్పించారు. భక్తులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల కోసమా..పైసల కోసమా..!



**మద్దికెర,మార్చి 8,ప్రభాతవార్త :** నిరుపేదల కల నిజం చేయాలన్న సదుద్దేశ్యంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ కార్డు కలిగినటువంటి ఇల్లులేని ప్రతి నిరుపేదకు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మింపచేసే భాద్యతను సిఎం తన భుజాల మీద వేసుకుని గత నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో అనేకమంది నిరుపేదలకు ఇల్లు నిర్మింపచేసి అందించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నియోజకవర్గంలో కూడా అనేకమంది నిరుపేదలకు ఈ గృహాలు మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగు నింపారు. అయితే దీనికి భిన్నంగా మండల కేంద్రంలో అదిగో చూడు ఇదిగో చూడు అంటూ అధికారులు,ప్రజా ప్రతినిధులు కాలయాపన చేస్తూ జగనన్న కాలనీల్లో అరకొర వసతులతో కూడా ఇప్పటికీ జగనన్న కాలనీని ప్రారంభించలేకపోయారు. హెచ్‌పి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న స.నం 444/2బి ప్రభుత్వ భూమిపై అధికార పార్టీ నాయకులకు కన్ను పడడం ఏమిటి. నిజమైన పేదలకు పంచడానికా..పైసలు ఇచ్చిన వారికి పంచడానికా..!అని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనప్పటికీ అధికార పార్టీకి ఓట్లు పడడానికి మేము పట్టాలు పంచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అక్కడ ఎస్‌సిల స్మశాన వాటిక ఉండడంతో కేవలం ఎస్‌సిలు మాకే కావాలని 28రోజుల నుండి రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. బుధవారం నాడు ఎస్‌సి కాలనీకి చెందిన వ్యక్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన సంఘటన విధితమే. ఇదే సర్వేనంబర్‌పై గతంలో ఎస్‌సి కులస్తులకు అనేక పట్టాలు కూడా కలిగి ఉండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతమంది ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రభుత్వ పెద్దలు,అధికారులు ఆ స్థలాన్ని పంచడానికి కంకణం కట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## ప్రతి మహిళా ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలి



**నందికొట్కూరు,మార్చి 8,ప్రభాతవార్త:** తమ హక్కుల సాధనకై ప్రతి మహిళ ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న గాదె.సుధీర్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కారించుకొని ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళీలు అర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణి చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు దాటిన ఇంకా మహిళలపై వివక్షత, లైంగికదాడులు కొనసాగడం దారుమణి, ఇటీవలే అంగన్వాడీలు తమ ఉద్యోగ భధ్రత కోసం సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంభించి వారిని తీవ్ర భయాంధోళనకు గురి చేసిందన్నారు. డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ మహిళా ఉద్యోగులకు, కర్షకులకు ఎనిమిది గంటలకు పని కుదించారని, స్త్రీలకు సమాన అవకాశాలు ఉండాలని సమాన పనికి సమాన వేతనం ఉండాలని రాజ్యాంగ బద్దత కలిపించారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా నందికొట్కూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానని మహిళలకు ఏ చిన్న సమస్య ఉన్న న్యాయ పరంగా పోరాడి పరిష్కారం అయ్యేంత వరకు అండగా ఉంటామని, తమ అధికారం ప్రధాన పార్టీలు ఓటర్లను మభ్యపెట్టేందుకు ఆచరణ కాని ఇస్తారని ప్రజలు విద్యావేత్తలను, యువతను ప్రోత్సాహించాలని, నాకు అవకాశం ఇస్తే ఈ ప్రాంతవాసిగా నియోజకవర్గాన్ని అభివృద్ది పథంలో నడిపిస్తామని గాదె సుధీర్ తెలిపారు.

## ఆశ్రమం నందు మహిళా దినోత్సవ వేడుకలు



**ఆదోని రూరల్,మార్చి 8,ప్రభాతవార్త :** పట్టణంలోని జీవనజ్యోతి ఆశ్రమంలో ఉన్న మహిళలతో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శీను తెలిపారు. ఈ సందర్బంగా శీను మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న వాళ్లతో మహిళా దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలో ఇద్దరు మహిళలను సన్మానించారు. అనంతరం అక్కడున్న వారందరికి స్వీట్,కారా ఇవ్వడం జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు,దినేష్,పవన్,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## భోగేశ్వర ఆలయంలో ఉచిత వైద్యశిబిరం

- ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య




**గడివేముల, మార్చి08, ప్రభాతవార్త;** నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ చైర్ పర్సన్ పర్లా దస్తగిరి ఆదేశాల మేరకు గడివేముల మండల రెడ్ క్రాస్ చైర్ పర్సన్ వి.వి. కృష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారంనాడు మండలంలో ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. గడివేముల ఎస్ఐ బి.టి. వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బంది రిబ్బన్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానం ఆలయంలో దుర్గా సమేత భోగేశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంచాలా మంచి కార్యక్రమం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గడివముల మండల ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల గౌరవాధ్యక్షులు ఇందిరా వరదాచార్యులు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అనంత్‌కుమార్, రమేష్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు శ్రీధర్‌బాబు, ఆర్ఎంపీ, పీఎంసీ సోదరులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న 100 పడకల ఆస్పత్రి ప్రారంభం



**బనగానపల్లె, మార్చి 8,ప్రభాతవార్త:** ఈ నెల 12న సాయంత్రం బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నట్లుగా వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహాన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే సహాకరాంతో ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో నిర్మించిన ఆసుపత్రిలో త్వరలోనే ప్రజలు సేవలు పొందవచ్చునని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని కావున నియోజకవర్గంలోని వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, వాలెంటీర్లు, గృహాసారదులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

## చీటింగ్ కేసులో ముద్దాయి అరెస్టు



**దేవనకొండ,మార్చి 8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బండగట్టు గ్రామానికి చెందిన చీటింగ్ కేసులో ముద్దాయి కురువ చంద్రన్నను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సిఐ శ్రీనివాసులు శుక్రవారం విలేకర్లకు తెలిపారు.

## బసలదొడ్డిలో వైభవంగా శివరాత్రి వేడుకలు

:- రూ.4లక్షలతో చేసిన వెండి,పంచలోహ నాగభరణాలు స్వామి వారికి అప్పగింత



**పెద్దకడుబూరు,మార్చి 8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ కాశీవిశ్వనాథ్ శివాలయంలో శుక్రవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు శివలింగానికి రూ.4లక్షలతో చేయించిన వెండి,నాగభరణం అలాగే గ్రామానికి చెందిన భాస్కర్ అనే భక్తుడు రూ.22వేలతో చేయించిన పంచలోహ నాగభరణాలను ఆలయ పూజారి మదవయ్య చేతుల మీదుగా స్వాముల వారికి సమర్పించారు. అంతకుముందు నూతనంగా చేయించిన వెండి,పంచలోహ నాగభరణాలను భక్తులు తలపై పెట్టుకుని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు దర్శనానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుడ్డా అంజినమ్మ,గ్రామపెద్దలు బుడ్డా శ్రీరాములు,క్రిష్ణారెడ్డి, గవిగట్టు ఈరన్న,కిట్టయ్య,లక్ష్మికాంత్,భాస్కర్, బుడ్డా కృష్ణ,హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలలో పూజలు




**పగిడ్యాల, మార్చి 8,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వివిధగ్రామాల్లోని వెలసిన శివాలయాల్లో శుక్రవారం ప్రజలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. పగిడ్యాల సర్వేశ్వరఅలయం, బీరవోలు బ్రిడ్జివద్ద వెలసిన శ్రీభీమలింగేశ్వరస్వామి వద్ద పూజలు చేసేందుకు మహిళలు భారులు తీరారు. పగిడ్యాలలోని పురాతన శివాలయం, పడమర ప్రాతకోటలోని నందీశ్వర, నాగేశ్వర, తూర్పు ప్రాతకోటలో నాగేశ్వరఅలయంలో ఎపి హైకోర్టు న్యాయమూర్తి నూనెపల్లె హరినాథ్ అలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయాగ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు, ముఖ్యంగా మహిళలు భక్తి శ్రద్దలతో తెల్లవారుజామున స్నానాలు అచరించి అలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా అలయాలను ప్రత్యేకంగా అలకరించారు.

## విద్యాహక్కు చట్టం కింద ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం



**కౌతాళంరూరల్, మార్చి08, ప్రభాతవార్త;** మండలంలోని ప్రయివేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉచిత విద్యకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు -1, 2 వరప్రసాద్, శోభారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి మండలంలో ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు వారి సమీప నివాస ప్రాంతాల్లో ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశాల కోసం పాఠశాల విద్యాశాఖ కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అధికారుల ఆదేశాల మేరకు మండలంలో దరఖాస్తులు కోరుతున్నట్లు వారు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్‌కార్డు ద్వారా ప్రాథమిక వివరాలతో ఆన్‌లైన్‌లో ఈనెల మార్చి 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. అర్హులైన విద్యార్థులను లాటరీ విధానం ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

